క్లుప్తంగా...

ఎల్ఐజీలో ఖాళీ జాగాల అభివృద్ధికి కృషి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో హౌసింగ్ బోర్డు నిర్మించిన బ్లాకుల చుట్టూ ఉన్న ఖాళీ జాగాలను అభివృద్ధి చేయాలని పోచారం ఎల్ఐజీ టౌన్‌షిప్ సొసైటీ నిర్ణయించింది. ఈ విషయాన్ని హౌసింగ్ బోర్డు అధికారులకు సొసైటీ ప్రతినిధులు గురువారం తెలియజేశారు. ఖాళీ జాగాలను శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సొసైటీ ముందుకు వచ్చిందని వివరించారు. అందుకు హౌసింగ్ బోర్డు అధికారులు సహకరించాలని సొసైటీ ప్రతినిధులు కోరగా, పరిశీలిస్తామని చెప్పారు.

మహాలక్ష్మీ దేవి అలంకరణలో గండి మైసమ్మ



మేడ్చల్: దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజైన గురువారం గండి మైసమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. వివిధ మండపాలు, కాలనీలు, ఆలయాల్లో మూడవ రోజు నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గండి మైసమ్మ ఆలయంలో భవానీ భక్తులకు నిత్య అన్నదానం నిర్వహిస్తున్నారు.

అన్నపూర్ణాదేవి అలంకరణలో..



కీసర: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైన శ్రీభవానీ శివదుర్గాదేవి అమ్మవారు గురువారం అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మాదారంలో బొడ్రాయి పండగ



ఘట్‌కేసర్: మాదారంలో బొడ్రాయి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ రవితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు మల్లేశ్, సత్తయ్య, బస్వరాజ్, వీరారెడ్డి, ప్రకాశ్, ప్రేమ్‌కుమార్, మధు, అనిల్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం చాటాలి



జవహర్‌నగర్: విద్యార్థులు విద్యా, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో నైపుణ్యం చాటాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆర్గనైజర్ కూరపాటి రాజశేఖర్ అన్నారు. గురువారం స్థానిక తెలంగాణ క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి అండర్–14, 16, 18, 20 బాలబాలికల అథ్లెటిక్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో కోచ్‌ల అడుగుజాడల్లో ముందుకు సాగాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో మేడ్చల్ టీమ్‌ను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో శేఖర్‌రావు, అశోక్, ప్రశాంత్, పీఈటీలు సునీల్, రవి, సురేందర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో శుభకార్యం.. అంతలోనే విషాదం

మేడ్చల్‌రూరల్: మనవరాలి శారీ ఫంక్షన్ సందర్భంగా బంధువులకు విందు ఇచ్చేందుకు మటన్ కొట్టిస్తున్న వృద్ధుడు హార్ట్ స్ట్రోక్‌కు గురై మృతిచెందిన ఘటన మేడ్చల్ మండలంలోని లింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, బంధువుల వివరాల ప్రకారం లింగాపూర్ గ్రామానికి చెందిన భైరి యాదగిరి(63)కు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. కుమారుడు శ్రీకాంత్‌కు కూతురు లాస్యప్రియ, కుమారుడు ఉండగా గురువారం లాస్యప్రియ శారీ ఫంక్షన్‌ను మేడ్చల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేశారు. బంధువులకు విందు భోజనం ఏర్పాట్లలో భాగంగా మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో మటన్ సిద్ధం చేస్తున్నారు. అక్కడే నిలబడి సిగరేట్ తాగుతున్న యాదగిరి ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే చికిత్స నిమిత్తం కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో బంధు మిత్రుల రోదనలతో ఆ ప్రాంతం విషాదఛాయలు అలుముకుంది.

మేడ్చల్ నియోజకవర్గం రాజకీయంలో నేతలు రంగులు మారుస్తుండటంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అధికార బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర జంగయ్య(వజ్రేష్) యాదవ్‌కు అసమ్మతి నేతలు మద్దతు ఇస్తున్నా కీలక అసమ్మతి నాయకుడు హరివర్ధన్‌రెడ్డి రూపంలో ఇంకా అనిశ్చితి కనిపిస్తోంది. – మేడ్చల్



కాంగ్రెస్‌లో చేరుతున్న సుధీర్‌రెడ్డి(ఫైల్)

బీఆర్ఎస్‌కు లాస్.. కాంగ్రెస్‌కు బూస్ట్

రంగులు మారుతున్న రాజకీయంతో మారుతున్న సమీకరణాలు

బలం, బలగంతో..

సుధీర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి మారడంతో కాంగ్రెస్‌కు బలం సమకూర్చగా బీఆర్ఎస్‌కు నష్టం చేకురుస్తుంది. కాంగ్రెస్ అభ్యర్థి జంగయ్యయాదవ్‌కు మద్దతుగా నియోజకవర్గ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, నియోజకవర్గ ఓటర్లపై ప్రభావం చూపే సత్తా ఉన్న మైనంపల్లి హన్మంత్‌రావు, నిలవడం, అసమ్మతితో ఉన్న హరివర్ధన్‌రెడ్డితో మంతనాలు జరపడంతో నాయకులపరంగా చూస్తే కాంగ్రెస్ బలం పెరిగినట్లు కనిపిస్తుండగా మంత్రి మల్లారెడ్డి తన బలం, బలగంతో దూసుకుపోతున్నారు.

సుధీర్‌రెడ్డి లాస్ ఎంతగా చూపుతుందో..?

మంత్రి మల్లారెడ్డికి కొరకరాని కొయ్యగా..

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మేడ్చల్ నియోజకవర్గంలో సీనియర్ రాజకీయవేత్త, వార్డు సభ్యుడిగా ప్రస్థానం ప్రారంభించి గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నో పదవులు చేపట్టిన ఆయన ఎమ్మెల్యే వరకు ఎదిగారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే. సుదీర్ఘ అనుభవం ఉన్న సుధీర్‌రెడ్డి ఐదేళ్లుగా అసమ్మతితో ఉన్నా కుమారుడు శరత్‌చంద్రారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా బీఆర్ఎస్ నుంచి ఉండటంతో స్వపక్షంలో విపక్ష నాయకుడిగా ఉంటూ మంత్రి మల్లారెడ్డికి కొరకరాని కొయ్యగా మారాడు. నియోజకవర్గమంతా పట్టున్న నాయకుడు, సీనియర్ నాయకుడు, పోల్ మేనేజ్‌మెంట్ తెలిసిన నాయకుడు, నాలుగు లక్షలకు పైగా ఓటర్లు ఉన్న ఉమ్మడి ఘట్‌కేసర్ మండలం, బోడుప్పల్, పీర్జాదిగూడలో పూర్తిగా పట్టుఉండటం, అనుచరులు ఎక్కువగా అక్కడే ఉండటంతో ఆయనకు ప్లస్ పాయింట్‌గా ఉంది. బీఆర్ఎస్‌కు ఇదే మైనస్ పాయింట్‌గా మారింది. కాంగ్రెస్ అభ్యర్థి బోడుప్పల్ కావడం, ఘట్‌కేసర్‌కు చెందిన సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి కాంగ్రెస్‌లో చేరడం కాంగ్రెస్‌కు కలిసివచ్చే బలం. ఉమ్మడి ఘట్‌కేసర్ బీఆర్ఎస్‌లో మంత్రి మల్లారెడ్డి తర్వాత రాజకీయం చేస్తున్న ప్రధాన నాయకులు సుధీర్‌రెడ్డి అనుచరులే కావడంతో వారి ప్రభావం ఎంత, వారు ఎక్కడ ఉంటారు వంటి విషయాలపై బీఆర్ఎస్ అధిష్టానం ఆరా తీస్తోంది. మొత్తం మీద సుధీర్‌రెడ్డి, ఆయన కుమారుడు శరత్‌చంద్రారెడ్డి కాంగ్రెస్‌లో చేరడం బీఆర్ఎస్‌కు మైనస్.. కాగా కాంగ్రెస్‌కు ప్లస్‌గా మారింది.



ఫైల్

ఫలించిన రేవంత్ వ్యూహం..

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి సుధీర్‌రెడ్డికి దగ్గర బంధుత్వం ఉంటడంతో ఆయన వరుసకు తన అన్న అయిన సుధీర్‌రెడ్డిని చాలా రోజుల నుంచి పార్టీ మార్చేందుకు ప్రయత్నాలు సాగించాడు. రేవంత్‌కు రాజకీయంగా శత్రువుగా ఉన్న మంత్రి మల్లారెడ్డితో సుధీర్‌రెడ్డికి కూడా శత్రువుగా మారడంతో ఇద్దరి శత్రువైన మల్లారెడ్డిని రాజకీయంగా దెబ్బకొట్టాలని రేవంత్‌రెడ్డి పావులు కదిపి సుధీర్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడంలో సఫలీకృతులయ్యారు.

పదవి పోతుందని తెలిసినా..

పార్టీ మారితే శరత్‌చంద్రారెడ్డి పదవి పోతుందని తెలిసినా కుమారుడిని తీసుకుని కాంగ్రెస్‌లో చేరడం చర్చగానే ఉంది. మేడ్చల్ జెడ్పీలో ఐదుగురు జెడ్పీటీసీలు ఉండగా ఒకరు కాంగ్రెస్, నలుగురు బీఆర్ఎస్ సభ్యులుగా ఉన్నారు. శరత్‌చంద్రారెడ్డి కాంగ్రెస్ వైపు వెళ్లడంతో కాంగ్రెస్ బలం ఇద్దరికి మారినా చెయ్యి కోసం కావాల్సిన బలం బీఆర్ఎస్‌కే ఉంది. పదవి కాలం ఆరు నెలల్లో ముగియనుంది. ఎన్నికలు ముగిశాక అవిశ్వాసం పెట్టి కుమారుడి పదవికి ఎసరు పెడతారని తెలిసినా పార్టీ మారడంలో కుర్చీ మీద ప్రేమ కన్నా మల్లారెడ్డిని ఓడించాలనే కసితో మాజీ ఎమ్మెల్యే వర్గంలో కనిపిస్తుంది.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కళాశాలలో రకరకాల పూలతో బతుమ్మలను అందంగా అలంకరించి ప్రతిష్ఠించారు. విద్యార్థినులు, సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి రావడంతో కళాశాల ప్రాంగణం కోలాహలంగా మారింది. కోలాటం, బతుకమ్మ పాటలకు అనుగుణంగా సంప్రదాయ నత్యాలు అలరించాయి.

నర్సింహారెడ్డి కళాశాలలో బతుకమ్మ వేడుకలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, మహిళా అధ్యాపకులు పూలతో బతుకమ్మను పేర్చగా కళాశాల సెక్రటరి త్రిశూల్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ పండగ విశిష్టతను నేటి యువతకు తెలిపేందుకు పెద్ద ఎత్తున కళాశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించినట్లు సెక్రటరి త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ సంగీత తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ నర్సింహారెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డీన్, రామదాసు, సౌమ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మైసమ్మగూడలో..



సంస్కృతి కళాశాలలో బతుకమ్మ సంబురాలు

నిత్యం ప్రజల్లోనే ఉండాలి

మేడ్చల్: మేడ్చల్ మండలం, మున్సిపాలిటీల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎన్నికలు ముగిసే వరకు ప్రజల్లోనే ఉంటూ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి అన్నారు. మేడ్చల్‌లో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు నెల రోజుల పాటు ప్రజల్లో ఉంటూ జోరుగా ప్రచారం నిర్వహించాలని అన్నారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఓటర్ల దగ్గరకు చేర్చి బీఆర్ఎస్ వైఫల్యాలను ఓటరు వివరించి హస్తంకు ఓటు వేసేలా చైతన్య పర్చాలన్నారు. సమావేశంలో మండల, గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మున్సిపాలిటీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణారెడ్డి

ఆద్రాస్‌పల్లిలో 2 కిలోల గంజాయి పట్టివేత

శామీర్‌పేట్: ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తున్న వ్యక్తిని గురువారం శామీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామ పరిధిలో శామీర్‌పేట ఎస్సై మునీందర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన తీగుళ్ల రామకృష్ణ తన ద్విచక్ర వాహనంపై ఒక బస్తాతో వెళ్తున్నట్లు గుర్తించి తనిఖీలు చేశారు.

సంచిలో సుమారు 2 కిలోల గంజాయిని గుర్తించి, నిందితుడిని శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేశా..

- ఎన్నికల్లో పోటీ చేస్తా
- కందాడి స్కైలాబ్‌రెడ్డి



కీసర: ఎన్నో ఏళ్లుగా తన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించిన తాను ఈసారి మేడ్చల్ అసెంబ్లీ బరిలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవనున్నట్లు కందాడి సైల్కాబ్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన కీసరలో మాట్లాడుతూ తన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 8 వేల కుటుంబాలకు అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయం అందించినట్లు చెప్పారు. ఆడపిల్లల వివాహాలకు పుస్తే, మెట్టలను అందజేసి ఆదుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా చనిపోయిన వ్యక్తులను శ్మశానవాటికకు తరలించేందుకు అంతిమయాత్ర వాహనాలను ఏర్పాటు చేసి కొనసాగించడం జరిగిందన్నారు. వినాయక చవితి, దుర్గామాత బోనాల ఉత్సవాలకు యువతను ప్రోత్సహించేందుకు ఆర్థిక సాయం అందిచడం, కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా పాఠశాలల్లో క్రీడాపోటీల సందర్భంగా విద్యార్థులు, యువతను క్రీడారంగాల్లో ప్రోత్సహించేందుకు తనవంతు సహాయ సహకారంగా క్రీడా వస్తువులను బహుమతులను అందజేస్తానన్నారు. పేదల కోసం పలుమార్లు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన తనను ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తారన్న నమ్మకం ఉందన్నారు. అందుకే ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలవడం ఖాయమన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న కలికోట కమలాకర్

జవహర్‌నగర్ బీజేపీ అధ్యక్షుడిగా కలికోట కమలాకర్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులుగా కలికోట కమలాకర్ నియమితులయ్యారు. బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి హాజరై జవహర్‌నగర్ అధ్యక్షులుగా కమలాకర్‌ను ఏకగ్రీవంగా ప్రకటిస్తూ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్ గుప్తా, కుర్ర పుణ్యరాజు, చంద్రమౌళి, అశోక్‌గౌడ్, మహేందర్‌యాదవ్, బాబు, లిఖితయాదవ్, సునీల్, మల్లేష్‌గౌడ్, మహేశ్వరిగౌడ్, రామునాయక్, సన్నీ, రాఘవేంద్రచారి, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్, మహేష్‌గౌడ్, యాదగిరి, అనిల్, రాజశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కీసర: మంత్రి మల్లారెడ్డి సమక్షంలో కరీంగూడకు చెందిన మాజీ ఉపసర్పంచ్ తోట నర్సింహారెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈమేరకు మంత్రి మల్లారెడ్డి స్వయంగా పార్టీ కండువాలు కప్పి వారిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం కరీంగూడలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొకుట్ల గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత కందాడి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరీంగూడలో అమ్మవారిని దర్శించుకున్న మంత్రి మల్లారెడ్డి



మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కరీంగూడ వాసులు



ఘనంగా దేవీ నవరాత్రులు



మేడ్చల్‌రూరల్: దేవీ శరన్నవరాత్రులు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లో ఘనంగా కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజు అమ్మవారు మహా చండీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

మహాలక్ష్మీ దేవిగా...

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ గాయత్రి మహాక్షేత్రంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం మహాలక్ష్మీ దేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

సేవలోనే సంతృప్తి

శామీర్‌పేట్: సేవ చేయడంలోనే సంతృప్తి లభిస్తుందని హెచ్‌బీఎల్ కంపెనీ ఉద్యోగులు తెలిపారు. జాయ్ ఆఫ్ హ్యాపీనెస్ బై గీవింగ్ నినాదంతో శామీర్‌పేట మండలం, అలియాబాద్‌లోని హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ కంపెనీలో పనిచేసే ఉద్యోగులు దానోత్సవం పేరుతో గురువారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గంగూడ గ్రామంలోని మానసిన వికలాంగుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అలియాబాగ్ గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలో దానోత్సవం పేరుతో కార్యక్రమాలు నిర్వహించి, పేద విద్యార్థులకు బుక్స్, వంటసామాగ్రి, దుస్తులు పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో యూనిట్ హెడ్ రాఘవేంద్రరెడ్డి, రమణారెడ్డి, సీఎస్ఆర్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న మాధవరెడ్డి, జంగయ్యముదిరాజ్

ఘట్‌కేసర్: అవుషాపూర్ గ్రామంలో కాంగ్రెస్ అధ్యక్షుడు కవాడీ వామన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ మండల మాజీ అధికారి ప్రతినిధి మాధవరెడ్డి, అవుషాపూర్ మాజీ అధ్యక్షుడు జంగయ్యముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్ ఎమ్మెల్యేగా తోటకూర వజ్రేశ్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నరసింహ, సందీప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగదీశ్, శ్రీనివాస్, సుధాకర్‌ముదిరాజ్, శ్రీరాములు నాయక్, రామునాయక్, మల్లేశ్, బుచ్చాలు, అనిల్‌నాయక్, ప్రకాశ్ పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో వజ్రేష్‌యాదవ్ జన్మదిన వేడుకలు



జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్: కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ జన్మదిన వేడుకలు గురువారం పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి టపాసులు కాల్చి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, నాయకులు సదానంద్, రజితగోపాల్, రాజుయాదవ్, ధనమ్మ, కొత్తకొండ వేణు, గండి సునీత, మాట్ల వినయ్‌కుమార్, సుమన్, లత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో..

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్ జన్మదిన వేడుకలను గుండ్లపోచంపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు, కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. మేడ్చల్ ఎమ్మెల్యేగా వజ్రేశ్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్, నాయకులు కృష్ణారెడ్డి, నవీన్ ముదిరాజ్, క్రిష్ణ, యాదగిరి, ఖాన్, నాగేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



గుండ్లపోచంపల్లిలో వజ్రేశ్ యాదవ్ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు